క్లుప్తంగా

చిమ్మ చీకటిలో 'బుర్రవేముల'



వీధి లైట్లు వెలగకపోవడంతో చీకట్లో ఉన్న బుర్రవేముల గ్రామం

దుమ్ముగూడెం: మండలంలోని బుర్రవేముల గ్రామంలో గత నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. అసలే వర్షాకాలం విష పురుగులు తిరిగే కాలం ఈ సమయంలో విద్యుత్ దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రెండు రోజులు భగీరథ నీళ్లు బంద్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నేడు, రేపు రెండు రోజుల పాటు మిషన్ భగీరథ గోదావరి నీళ్ల సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందని సంబంధిత అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోదావరి వరదల కారణంగా నీటిలో ఎక్కువ స్థాయిలో మురికి ఉండడంతో పాండవులగుట్ట ఫ్లాక్యులేటర్ ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు నీటి సరఫరాలో అంతరాయాన్ని గమనించాలని సూచించారు.

డిపో ఆవరణలో మొక్కలు

భద్రాచలంటౌన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా డిపో మేనేజర్ తిరుపతి మొక్కలు నాటారు. నాటుతున్న మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. మెకానికల్ ఇంజనీర్లు చక్రవర్తి, వెంకటేశ్వర్లు సూపర్వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

అన్నపురెడ్డిపల్లి: ఈ నెల 5వ తారీకు నుంచి 9వ తారీకు వరకు నిర్వహించనున్న పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఎంపీడీఓ మహాలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీఓ షాబ్నా, ఏపీఓ ప్రమీలా పాల్గొన్నారు.

వివాదంపై విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో జరిగిన వివాదంపై ఆర్సీఓ నాగార్జునరావు శుక్రవారం విచారణ చేపట్టారు. కొందరు విద్యార్థులు క్రమశిక్షణ తప్పారని వార్డెన్ మందలించడం, వార్డెన్‌పై సదరు విద్యార్థులు దాడి చేయడం, ఆ విద్యార్థులను హెచ్ఎం ఇంటికి పంపించడం తెలిసిందే. తల్లిదండ్రుల నిరసన నేపథ్యంలో భద్రాచలం ఆర్సీఓ ఈ ఘటనపై విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులతో, విద్యార్థులతో వేరువేరుగా మాట్లాడారు.

కరకట్టలు నిర్మించాలి

బూర్గంపాడు: ఏటా గోదావరి వరదలతో ముంపునకు గురవుతున్న బూర్గంపాడు వైపున కరకట్టలు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పున్నంచంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏటా వరదలతో బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక, మోతె, ఇరవెండి గ్రామపంచాయతీల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారన్నారు.

కనకదుర్గమ్మకు పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుర్రాల చెరువు గ్రామ శివారులో స్వయంభుగా వెలిసిన కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాడ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పూజలు చేశారు. అశ్వారావుపేట షిరిడి సాయి సేవా సమితి ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అమ్మవారికి సారె, చీర, 108 రకాల స్వీట్లు, 18 రకాల పండ్లను సమర్పించారు. సారెతోపాటు, బోనాలతో ఆలయం నుంచి కాలినకడన ప్రదర్శన చేశారు.

కూలీ పెంచాలి

బూర్గంపాడు: రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసర ధరలు,పెరిగిన జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ కూలి రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బూర్గంపాడు పాండవుల బస్తీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమా లలిత, సాయికుమార్, సాంబయ్య, పుట్టి కృష్ణ, ఆదెమ్మ, పుల్లయ్య, రమణమ్మ, వీరస్వామి పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టు ఆనకట్టకు గండ్లు పడి నష్టపోయిన గిరిజన రైతులకు తక్షణమే నష్ట పరిహారాన్ని ఇవ్వాలని ఆదివాసీ సేన ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు సోందెం సుమన్‌బాబు, వగ్గెల వెంకటేశ్వరరావు మాట్లాడారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

- వైర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు
- రైతులకు పలు అంశాలపై అవగాహన



గుండాల: రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ఫీడర్ లోని సీతారాంపురం గ్రామంలో విద్యుత్‌శాఖ ఏఈ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం పొలంబాట పట్టారు. పొలాల్లో ఒరిగిపోయిన కరెంటు స్తంభాలను నిలబెట్టడం, లూజు ఉన్న వైర్లను లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర తీగలు చెట్లు తొలగించడం తదితర పనులు చేపట్టారు. రైతులతో సమావేశం నిర్వహించి ఆటో స్టార్టర్లను తీసి కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది లైన్‌మేన్ వెంకటేశ్వర్లు, జెఎల్ఎం రామ్‌చందర్, రైతులు అన్నే సత్యనారాయణ మూర్తి, కొడాలి లోకేష్ బాబు పాల్గొన్నారు.

చర్ల: రైతులు తమ వ్యవసాయ మోటార్లకు ఆటో స్టార్టర్లు వాడవద్దని సాధారణ స్టార్టర్లే వాడుకోవాలని టీజీఎస్ ఎన్పీడీసీఎల్ చర్ల సెక్షన్ ఏఈ యోహాను సూచించారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పొలంబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చింతకుంట వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రైతులతో ఏఈ మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు.ఎస్ఎల్ఐ కేటీఎన్ మూర్తి, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, లైన్ మెన్‌లు కృష్ణ, విజయకుమార్ పాల్గొన్నారు.

గుండాల: మండలం, ముత్తాపురం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు రైతు పోలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్ఈ బీక్ సింగ్, డీఈ నందయ్యలు మోటార్ల దగ్గర కెపాసిటర్లు వాడటం వల్ల కలిగే ఉపయోగాలు, ఆటో స్టార్టర్ వాడటం వల్ల నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈలు రమేష్ బాబు, రవి, రాము, గుండాల మండల విద్యుత్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ అన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఏఎస్పీ పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పని సరిగా శిరస్త్రాణం ధరించడంతో పాటు ఫోన్‌లో మాట్లాడకుండా వాహనాలను నడపాలని సూచించారు. నంబర్ ప్లేట్‌లు లేకుండా నడుపుతున్న 30 వాహనాలను గుర్తించామని, మొదటి సారిగా పట్టుబడిన క్రమంలో అవగాహన కల్పించి, కేసు నమోదు చేయకుండా వదిలి పెడుతున్నామని అన్నారు. రానున్న రోజుల్లో ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేటు లేకుండా వాహనాల నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్, ఏఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

డీడబ్ల్యూఓ విచారణ

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ టీచర్, ఆయా మధ్య వివాదంతో అంగన్‌వాడీ కేంద్రం మూతబడగా పత్రికల్లో వచ్చిన కథనాలతో డీడబ్ల్యూఓ విజేత స్పందించారు. మండలంలోని ఊట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ బండారి కేదారేశ్వరి, ఆయా తెల్లం రాములమ్మ మధ్య గొడవ కారణంగా పది రోజులుగా కేంద్రం తెరుచుకోలేదు. దీంతో డీడబ్ల్యూఓ శుక్రవారం కేంద్రాన్ని సందర్శించి సీడీపీఓ రోజారాణి, సెక్టార్ సూపర్‌వైజర్ వరలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో పిల్లలు తక్కువగా ఉండడంపై మందలించారు. సమన్వయంతో పని చేస్తూ కేంద్రాలను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని చెప్పారు. ఈ విషయమై సీడీపీఓ, సూపర్‌వైజర్, టీచర్ నుంచి వివరణ తీసుకున్నాక శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ

కరకగూడెం: మండలంలోని పద్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆ కేంద్రం చిన్నారులతో పాటు మొగలితోగు, నీలాద్రిపేట వలస ఆదివాసీ చిన్నారులు మొత్తం 60 మందికి ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వితరణ చేశారు. సంస్థ సభ్యుడు, కరకగూడెం గ్రామీణ వైద్యులు షేక్ సోందుపాషా ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై రాజేందర్ చేతుల మీదుగా పిల్లలకు స్కూల్ బ్యాగులు, పలకలు డ్రాయింగ్ కిట్లు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఈసం అనురాధ, స్వర్ణలత, సుజాత గ్రామస్తులు పఠాన్ యాకుబ్ ఖాన్, ఈసం రాజబాబు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వైద్య శిబిరాలు

నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వైద్య శిబిరాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయా మండలాల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఫీవర్ సర్వే, వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. రక్తనమూనాలు సేకరించారు. గ్రామాల్లో తిరిగి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు.



చర్లరూరల్: జీపీ పల్లి గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న శ్రీధర్

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని జానకీపురం గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: నాగారం గ్రామంలో వైద్యాధికారి మనేష్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్‌టీఎస్ సత్యం, ఏఎన్ఎమ్‌లు ధనమ్మ, భువనేశ్వరి, అరుణ, ఎల్టీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని పద్మగూడెం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేయగా.. డాక్టర్ నిశాంత్‌రావు, సిబ్బంది రాంప్రసాద్, శైలజ, ఆశావర్కర్లు లిల్లిపుష్ప, రాధ, ఎయిండ్ సంస్థల మండల సోషల్ మొబలైజర్ జ్యోతి పాల్గొన్నారు.

చంద్రుగొండ: మద్దుకూరు గ్రామంలో ఎర్రగుంట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయగా.. డాక్టర్ ప్రియాంక, సిబ్బంది రాంప్రసాద్, సుశీల, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

చర్లరూరల్: సత్యనారాయణపురం, కొయ్యూరు పీహెచ్‌సీల పరిధిలోని పెద్దిపల్లి, జీపీ పల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 81 మందికి వైద్యాధికారులు శ్రీధర్, దివ్యనయనలు వైద్య పరీక్షలు చేశారు. దోసిల్లపల్లి, గొంపల్లి, జీపీపల్లి గ్రామాల్లో దోమలమందు పిచికారీ చేశారు.

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి గ్రామంలో వైద్యాధికారి మధు సుమారు 126 మంది స్థానికులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం 'ఫ్రైడే డ్రైడే'కార్యక్రమాన్ని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ హెచ్ఈఓ కృష్ణయ్య ఏఎన్ఎం రుక్మిణి ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

చంద్రుగొండ: కేంద్రప్రభుత్వం తపాలశాఖ ద్వారా ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని తపాలశాఖ అసిస్టెంట్ సూపరింటెండ్ రంజిత్‌కుమార్ చౌదరి కోరారు. మండలంలోని రావికంపాడు గ్రామంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. శాఖ మేయిల్ ఓర్సెస్ సత్యనారాయణ, రాజేందర్, విజయ్, గ్రామస్తులు కోటేశ్వరరావు, రుక్మిణి, రాములు, ఉపాధ్యాయులు రమణ, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

కొరవడిన పర్యవేక్షణ

దమ్మపేట: మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించిన కాంక్రీట్ పనులు కొనసాగుతుండగా, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. సెంట్రల్ లైటింగ్ పనుల నిమిత్తం డివైడర్ మధ్యలో కాంక్రీట్ దిమ్మెలను పోయడం ప్రారంభించారు. ఈ పనుల పర్యవేక్షణకు సంబంధిత అధికారులెవరూ లేకపోవడంతో పనుల నాణ్యతపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేశారు.

పరిమితి దాటొద్దు

గుండాల: మండలంలోని గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యం అందించరాదని ప్రభుత్వ వైద్యాధికారి మనేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ల్యాబ్‌లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో ఆర్ఎంపీలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్‌టీఎస్ సత్యం, ఎల్‌టీ రమేష్, ఏఎన్ఎమ్‌లు భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు

చంద్రుగొండ: ఎస్సీ వర్గీకరణ చేయడం సబబు కాదని మాలమహానాడు మండల బాధ్యులు ఎలమందల లక్ష్మణరావు అన్నారు. చంద్రుగొండలోని అంబేత్కర్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు బడుగు శంకర్, తలారి నాగరాజు, దాసరి బాబు, రాయి రాజా, బడుగు రాములు, గణేష్, రాజారావు, బడుగు కృష్ణవేణి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చర్ల: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్‌లో ఉన్న గురుకుల కళాశాలలో గిరిజన విద్యార్థిని కట్టం అశృత ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ముసలి సతీష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీవైఎల్ నాయకులు సురేష్, శ్యాంసుందర్, సతీష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

సన్మానం..

చంద్రుగొండ: మండలంలోని వివిధ పంచాయతీల్లో కార్యదర్శులుగా పనిచేస్తూ బదిలీ అయిన వారికి శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. బదిలీ అయిన కార్యదర్శులు ఉపేందర్, కిరణ్, శైలజ, ప్రసాద్, రమేష్, బాబులాల్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంపీఓలు తులసీరాం, ఖాన్ పాల్గొన్నారు.

రుణమాఫీ వర్తింపజేయాలి

గుండాల: మండలంలోని గిరిజనేతర రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని ఎంపీపీ కొంద్రు మంజు భార్గవి, వైస్ ఎంపీపీ రేస్ ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్ఎస్, సీపీఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శకుంతలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రహీం, యాసారపు బాబు, బాబా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

ములకలపల్లి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. స్వంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వరద బాధితుల ఆందోళన



రహదారిపై ఆందోళన చేస్తున్న వరద బాధితులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆశోక్‌నగర్, కొత్త కాలనీ ప్రజలు తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని శుక్రవారం సాయంత్రం చర్ల రోడ్డులోని నన్నపనేని మోహన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పునరావస కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. రోడ్డుకు అడ్డుగా నిల్చుని ఆందోళన నిర్వహించారు. ప్రతి ఏటా అధికారులు రోజుల తరబడి పునరావస కేంద్రాలలో ఉంచి ముంపు గురైన ఇళ్లలోకే పంపిస్తున్నారని, పట్టణంలోని మనుబోతుల చెరువు వద్ద నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. గంట పాటు నిర్వహించిన ఆందోళనతో చర్ల, భద్రాచలం ప్రధాన రాహదారిపై భారీగా నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్, పట్టణ ఎస్సై పీఎస్ రావులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చచెప్పి ఆందోళను విరమింపజేశారు.

అనుమతులు తప్పనిసరి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌ల నిర్వహణకు తప్పని సరిగా వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చైతన్య సూచించారు. శుక్రవారం డాక్టర్ చైతన్య, డిప్యూటీ డెమో మొహమ్మద్ ఫైజ్ మోహిఉద్దీన్‌తో కలిసి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లతో పాటు ల్యాబ్‌లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్ 2010 ప్రకారం వైద్య ఆరోగ్య శాఖ నుంచి అన్ని అనుమతులు తీసుకోవాలని, తనిఖీలు చేస్తున్న సమయంలో చట్టప్రకారం అనుమతులు లేకపోతే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ తనిఖీని నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే సదరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

వాహన తనిఖీలు

కరకగూడెం: మావోయిస్టుల వారోత్సవాలు నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పలు గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. కరకగూడెం ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేసి, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మండలంలోని పగిడేరు, రామానుజవరం కూడళ్ల వద్ద శుక్రవారం మణుగూరు ఎస్సై రంజిత్ వాహనాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధృవపత్రాలు పరిశీలించారు.


తల్లిపాల వారోత్సవాలు..

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ అధ్వర్యంలో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. తల్లిపాల ఆవిశ్యకతపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన పిల్లలకు గంటలో ముర్రుపాలు పట్టించాలని, పిల్లలకు ఆరునెలలు వచ్చే వరకు తల్లిపాలు తప్పనిసరి అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


– సాక్షి నెట్‌వర్క్



గుండాల: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మణుగూరురూరల్: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎంపీటీసీ కోటేశ్వరరావు



కరకగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



గోదావరి నది మెట్ల వద్ద పేరుకుపోయిన ఒండ్రును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఇటీవల వచ్చిన వరద కారణంగా గోదావరి కరకట్ట వద్ద ఉన్న మెట్ల వద్ద ఒండ్రు మట్టి పేరుకుపోవడంతో గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తన సిబ్బందితో గడిచిన రెండు రోజులుగా శుభ్రం చేసే పనులు నిర్వహిస్తున్నారు. మరో వారం రోజులు వరకు గోదావరి వరద ఉధృతి లేకపోతేనే ఈ ఒండ్రు మట్టి పూర్తిస్థాయిలో తొలగించగలమని గ్రామ పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. ముంపునకు గురైన కాలనీలలో విస్తృతంగా బ్లీచింగ్ చల్లుతూ, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపడుతున్నారు.

పశువుల యజమానులకు అవగాహన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రోడ్ల వెంబడి పశువుల కారణంగా వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, పశువుల యజమానులు వాటిని రోడ్లపై వదిలిపెడితే చర్యలు తీసుకుంటామని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆటోలో మైక్ ద్వారా అవగాహన కల్పించారు. ఆ పశువులను గోశాలకు తరలించే కార్యక్రమాన్ని కూడా చేపడతామని ప్రచారం చేపట్టారు.

శివపార్వతుల కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. శుక్రవారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఉదయం నుంచి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించి, అర్చకులు సత్యనారాయణశర్మ, సాయి ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన జక్కుల శిరీష మృతదేహానికి డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, వీరమాచనేని రాజశేఖర్, సామకూరి వెంకన్న, చెంచల రాము, బచ్చు వెంకటరమణ, కంట్లమయ్య, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ ఫ్యాక్టరీలో ప్రమాదానికి గురై గాయపడిన పేరాయిగూడెం వాసి తగరం వెంకటేశ్వరరావును అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జూపల్లి రమేష్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు జూపల్లి ప్రమోద్, ఎంపీటీసీ సభ్యులు మిండా హరిబాబు, మాజీ ఎంపీటీసీ నండ్రు రమేష్, సూరనేని బాబ్జీ, నార్లపాటి దివాకర్, ఎన్ బుచ్చిబాబు, తగరం ముత్తయ్య, తడికమళ్ల శ్రీను, ఫణి నాగు, కంచర్ల బాబీ ఉన్నారు.

కేసీఆర్‌తోనే 'సీతారామ' సాధ్యమైంది..

ములకలపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, జెడ్పీటీసీ సున్నం నాగమణి అన్నారు. ములకలపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడారు. లక్షలాది ఎకరాల పంట పొలాలను సమస్య శ్యామలం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ సీతారామ ప్రాజెక్ట్ రూపకల్పన చేశారని అన్నారు. బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, పుష్పాల హనుమంతు, పొక్కిలి రాజు, పుష్పాల సాయి, తానం కృష్ణ, ఏసుపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

ఎస్సీ వర్గీకరణకు కోర్టు అనుకూలంగా తీర్పునివడంతో పలు ప్రాంతాల్లోని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ర్యాలీలు నిర్వహించి కేక్ కట్ చేశారు. బాబా సాహెబ్ అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ అధినాయకుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలను పాలాభిషేకాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటం ఫలించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 50 లక్షల మందికి పైగా ఎస్సీ వర్గీకరణతో లబ్ధి పొందనున్నారన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ నాయకులు



గుండాల: అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



అశ్వాపురం: మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వీరస్వామి వర్ధంతి సభ

దుమ్ముగూడెం: దివంగత సీపీఎం సీనియర్ నాయకుడు సోయం వీరస్వామి రెండో వర్ధంతి సభను పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం భీమవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వీరస్వామి పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య,బొల్లి సూర్యచంద్రరావు, సోయం నాగమణి, సోయం జోగారావు, వీరస్వామి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.